# ప్రేమించి పెళ్లి చేసుకో

దమ్ము శ్రీనివాసబాబు



ఆరోజు ఆదివారం. మేము నలుగురం కలసి ఆరోజు సుధాకర్ యింట్లో గడపాలని నిర్ణయించుకున్నాం. సమయం పది - ఆ ప్రాంతాల్లో సుధాకర్ యింట్లో కలుసుకున్నాము. నేను, నాగేశ్వరరావు సుదర్శన్.

మేము వెళ్ళేటప్పటికి సుధాకర్ షేవ్ చేసుకుంటున్నాడు. వాడాపనిని పూర్తిచేసి వచ్చేలోగా 'రమ్మీ' ఆడ్డానికి పేక ముక్కలను సిద్ధంచేసి కూర్చున్నాం.

మా నలుగురిలోనూ నన్ను నేను పరిచయం చేసుకోవడం మీకు 'బోర్' కొట్టించడమే అవుతుంది.

నాగేశ్వరరావు - వీడు 'కళల బ్రహ్మచారి' - అంటే బి. ఏ. - (బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్) అనిపించుకొని, ప్రభుత్వ బానిసగా మారిపోయాడు. ఇంకా పెళ్ళికాలేదు. కానీ వాడు కాలేజీ లైఫ్‌లో చేశానని చెప్పుకుంటుంటాడు 'అడ్వెంచర్స్'. పర్ఫెక్ట్ ఛాటర్ బాక్స్. వాడుంటే మా అందరికీ మాంచి కాలక్షేపం.

సుదర్శన్ - షార్ట్ టెంపర్ ఫెలో. ముక్కుమీదే ఉంటుంది కోపం. అందుకు నిదర్శనంగా ఒక చిన్న సంఘటన మీకు తెలియజేస్తాను.

ఒకరోజు నేను, వాడు కలసి కోఠీలో బస్సెక్కాము. అది ట్రైలర్ బస్. కండక్టరు టికెట్ అడుగుతూ వస్తున్నాడు. గొట్టం ప్యాంటు - జాకెట్ స్టాసు. నోట్లో సిగరెట్టున్న ఒక విద్యార్థి తలబిరుసుగా సమాధానమిచ్చి, కండక్టరు టికెట్ తీసుకోమని బలవంతం చేయగా - "మా (విద్యార్థుల) తడాఖా చూపించమంటావా? విజిల్ వేస్తే చాలు యీ బస్సును యిక్కడే కాల్చేస్తాం" అని మరీ నిక్కుగా చెప్పాడా విద్యార్థి! అంతే.

"బస్సును కాలుస్తావురా యిడియట్. నీ బాబుదనుకున్నావా?" అని బలంగా ముఖంమీద వాయించి పెట్టాడు.

ఆ తరువాత అందరూ మా వాణ్ణి పొగిడార్లెండి మంచిపని చేశాడని.

అదీ వాడి కథ.

సుధాకర్-వీడు 'పుస్తకప్పురుగు' అని అనిపించుకున్నా, అన్ని తెలుగు సినిమాలు (ఎంత 'బోర్' కొట్టించేవైనాసరే) వదలకుండా చూస్తుంటాడు.

పరిచయాలు అయిపోయాయిగా అసలు కథకొస్తాను.

'రమ్మీ' మొదలుపెట్టాం. హుషారుగా సాగుతోంది ఆట.

"అగరొత్తేది?" అని ప్యాంటు జేబువెదుక్కొని సిగరెట్ వెలిగించాడు నాగేశ్వరరావు. వాడికి అన్ని 'పానా'లు ఉన్నాయి కాబట్టి ధూమపానం తప్పలేదుమరి.

"ఒరేయ్ నాగూ! చెప్పరా. నీ లైఫ్‌లో మరచిపోని మనోమధుర సంఘటన" అడిగాడు సినిమాలు తెగచూసే సుధాకర్.

మేమంతా వాడికి వంతపలికాము. సిగరెట్టు ముక్కను చివరిసారిగా పీల్చి - ప్రక్కనే పడేసి చెప్పడం మొదలుపెట్టాడు.

"నేను బి.ఏ ఫైనల్‌లో ఉన్న రోజులవి. అప్పుడే బాబాయి ఆరోగ్యం బాగాలేదని ఉత్తరం వస్తే అమ్మా, నాన్నగార్లు నన్నొక్కణ్ణి యింట్లో ఉంచి కర్నూలుకెళ్లారు. ఇంట్లో నేనొక్కడ్నేఉంటూ చేయి కాల్చుకోవలసి వచ్చింది. ఆ సమయంలోనే సుభద్ర నా జీవితంలో ప్రవేశించింది. జీవితంలోకంటే — హృదయంలో అంటే బాగుంటుందనుకుంటాను.

మా యింటి ప్రక్కనే ఉన్న రెండవ యిల్లే సుభద్రది. నేను తెల్లవారు ఝామునే లేచి పంపుదగ్గర నీళ్ళు పట్టుకుంటున్న సమయంలోనే ఆ అమ్మాయి పంపుదగ్గరికొచ్చేది. ఆ అమ్మాయి యిల్లు, మా యిల్లు ఒకే కాంపౌండ్‌లోనే ఉండడంవల్ల ఆ కాంపౌండ్‌లో వాళ్ళందరూ ఆ పంపుదగ్గరే నీళ్ళు పట్టుకోవాలి. ఒకరోజు చీకట్లోనే లేచి పంపుదగ్గరికెళ్ళబోతున్నాను. అంతలో ఆమె చల్లుతున్న కలాపి నీళ్ళు నా మీద పడ్డాయ్. నేను తలెత్తి ఆమె వైపు చూశాను. బెరుకు బెరుకుగా చూస్తూ "క్షమించండి" అంది. "ఫరవాలేదులెండి" అని

చిన్నగానవ్వి వంపుదగ్గర చొప్పు కడుక్కొని. పీట్స్ పట్టుకొని లోపలికి వచ్చేశాను. అదే మా పరిచయానికి నాంది. అది మొదలు ప్రతిరోజూ యిద్దరమూ ఒకే వేళకు లేచేవాళ్ళం. కాలేజీకబుర్లతో మొదలైన మా మాటలు వంటలతో ఆగిపోయేవి. "కూరలు చేసుకోవడం చేత కావడంలేదండి" అన్నానొక రోజు.

"అలాగా! ఎంత బాధ పడుతున్నారండి" అంది ఎంతో సానుభూతిగా.

ఆరోజు ఉదయం తొమ్మిదిగంటల సమయంలో పిరియడ్ సైన్సు ప్రొఫెసర్ క్లాస్ మిస్ అవుతుందేమోనని కూరలేవీ చేసుకోకుండా పెరుగుతో అన్నం తింటున్నాను. అప్పుడే తలుపు తోసుకొని వచ్చిన సుభద్రను చూసి తింటున్నవాణ్ణి ఆశ్చర్యంతో ఆగిపోయాను.

"అరె! అప్పుడే పెరుగన్నం తింటున్నారే? అయితే నే నాలస్యంగా వచ్చానన్నమాట. సరే! యీ పచ్చడెలా ఉందో చూడండి" అంటూ గోంగూర పచ్చడిగిన్నెను నా ముందు పెట్టింది. ఏం మాట్లాడ్డానికి మాటలు దొరక్క సుభద్రవైపు అలాగే చూస్తూ కూర్చున్నాను.

"మీకు గోంగూర పచ్చడంటే చాలా యిష్టం కదూ!" అంది ఎంతో గోముగా.

"మీకెలా తెలుసు?" అన్నాను ఏదో అనాలని.

"మీ అమ్మగారు మా అమ్మతో చెబుతుంటే విన్నాను" అంది నవ్వుతూ.


"మెనీ థాంక్స్!" అన్నాను.

"నేను రాగానే తినడం మానేశారే! సిగ్గేస్తోందా? అయితే నే వెళ్తానండి!" అంటూ లేవబోయింది.

"అబ్బే! అలాంటిదేమీలేదు కూర్చోండి. మీరు వెళ్ళిపోతే నేనన్నం తినడం మానేస్తాను" అన్నాను ముసి ముసి నవ్వులు చిందిస్తూ.

"బెదిరిస్తున్నారే!" అంటూ నవ్వి-పీట లాక్కొని నా ముందు కూర్చుంది.

నే నామెతో ఎలా మాట్లాడగలిగానా అని ఆశ్చర్యపోయాను నాకై నేనే. అప్పుడిలా వాగేవాణ్ణి కాదులే" అని నవ్వాడు నాగ్ పేకముక్కలను సర్దుకుంటూ.

దీర్ఘ రోగులకు
ఉత్తమ వైద్యము
నపుంసకత్వము, శుక్లనష్టము, హస్తప్రయోగము, అవయవము చిన్నదగుట, అవసరకాలమందు అసంతృప్తిని, ఉబ్బసము, బోదకాళ్ళు, చెవుడు, కడుపు నొప్పి, కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టలుద్వారా కూడా వైద్యము చేయబడును.

శ్రీ బాలాజీ వైద్యశాల
డా॥ పి. కుమారస్వామి దేవర
ట్రావెలర్సుబంగ్లా రోడ్, తెనాలి


"ముద్ద ఎక్కడంలేదా? తినిపించమంటారా! అంది సుభద్ర.

ఆమె చొరవకు మరీ ఆశ్చర్యపోయాను.

"అబ్బే! అవసరం లేదండి" అన్నాను తల వంచుకుని.

"ఏమండోయ్! మీరు ప్రతిసారి 'అండీ' అని 'మీరు' అని అంటున్నారు. నా పేరు మీరుకాదు. 'అండీ' అంతకంటే కాదు. ఒట్టి సుభద్ర. మీరు అది అంటే చాలు" అంది గుక్క తిప్పుకోకుండా.

"సరేలేండి! అలాగే పిలుస్తాను" అన్నాను.

"మళ్ళీ..." చిరుకోపంతో చూస్తూకూడా చిరునవ్వులు చిందిస్తూ అంది సుభద్ర.

"సారీ! యిప్పట్నుంచి సుభద్ర అని పిలుస్తాను సరేనా?" అన్నాను. ప్లేటులో చేయికడుక్కుంటూ.

చేయి కడుక్కోవడం పూర్తయిన తరువాత "గోంగోరపచ్చడి చాలాబాగుంది. నీవే చేశావుకదూ సుభద్ర!" అన్నాను భుజంమీద నున్న టవల్‌తో చేయి తుడుచుకుంటూ.

అప్పటి ఆమె ముఖంలో ఓ క్రొత్త వెలుగు దేదీప్యమానంగా ప్రకాశించడం కనిపించింది నాకు నూతనానందంతో మెరిసిపోతున్నాయి ఆమె కళ్ళు.

"అలాగని ఎందు కనుకున్నారు?" అంది అమోలా చూస్తూ.

"ఏమో! అలా అనిపించింది - అంతే." అన్నాను ఆమె ముఖంలోకి సూటిగా చూస్తూ.

"నిజంగా!" అంది క్రొత్త అందాలను పుణికి పుచ్చుకున్న పుత్తడి బొమ్మలా.

"అవును" అని "మైగాడ్! అప్పుడే తొమ్మిదిన్నర. బస్‌స్టాప్ కెళ్ళి క్యూలో నిలబడి, పోరాడి-చివరకు కాలేజీ చేరే సరికి ప్రొఫెసర్‌క్లాస్ కమెన్సవడం. అటెండెన్స్ అయిపోవడం గోవిందా!" అన్నాను కంఠపాఠం పెట్టినట్లు.

"నా వల్లే ఆలస్యమయింది క్షమించండి. మళ్ళీ వస్తాను" అంటూ వెళ్ళబోయింది.

చెయ్యి అడ్డంపెట్టి "ఉహూఁ! నీ వల్లకాదు. నావల్లే. నీతో యిలాగే మాట్లాడుతుంటే టైమే తెలియదు నాకు." అన్నాను.

"అలాగా!"అని వలపుచూపుల్ని విసరి పరిగెత్తింది.

ఆడవాళ్ళ చూపుల్ని చూస్తేనే మనసులో గదబిడ కలిగే మధుర దినాలు. ప్రొఫెసర్ క్లాస్‌లో కూర్చొని. నోట్సు వ్రాసుకోవడం మరచిపోయి, ఏవేవో ఊహించుకుంటూ తీయగా గడిపాను ఆ మూడు గంటలూ.

ఆ శనివారం మధ్యాహ్నం రెండు గంటలకే యింటి కొచ్చి, సోఫాలో కూర్చుని పేపరు చూస్తున్నాను. అంతలోనే వచ్చింది సుభద్ర - చేతిలో ఒక సాసర్‌తో. ఆ సాసర్‌నిండా మామిడిపండు ముక్కలున్నాయి. నేను గమనించనట్లు ముఖానికి పేపరు అడ్డంపెట్టుకున్నాను. సుభద్ర దగ్గరగావచ్చి పేపరులాగి టేబుల్‌మీద పడేసింది. నాకు కోపం వచ్చింది. నిజంగా కాదు - ఒట్టిగానే.

"నా చేతిలోని పేపరు నెందుకు తీశావ్!" అన్నాను బుంగమూతి పెట్టుకొని.

"ఇవి తినాలి" అంది సాసర్‌లోని మామిడి పండు ముక్కల్ని చూపిస్తూ.

"ఉహూఁ! నేను తినను" అన్నాను.

"తినేలాచేస్తా! లేకపోతే తినిపిస్తా!" అంటూ తన పైటకొంగును నడుముకు బిగించుకుంది. నే నా దృశ్యం చూసి నవ్వుతూ "అపర సత్యభామలా ఉన్నావ్ సుభద్రా!" అన్నాను.

"అలాగేం" అంటూ ఒక ముక్క తీసి నోట్లో పెట్టబోయింది. నేను గబుక్కున నోరు మూసేశాను. ఆ ముక్క క్రింద పడిపోయింది.

"అయితే తినరన్న మాట" అంది కోపంతో.

ఆ పోజ్‌లో ముద్దు పెట్టుకోవాలనిపించింది.

"కొంపతీసి అంతపని చేశావా! అయినా చేసే వాడివేరా! అసలే దేవాంతకుడివి" యీర్ష్యను ధ్వనింపజేస్తూ అన్నాడు సుదర్శన్.

"ఒరేయ్! నేను చెప్పేటప్పుడు అడ్డుపుల్లలు వేయొద్దని కొన్ని లక్షంసార్లు చెప్పి ఉంటాను. ఆ ఒప్పందంమీదే యిప్పుడీ కథ చెబుతున్నా. తరువాత నీ యిష్టం" అన్నాడు నాగేశ్వరరావు పేకముక్కల్ని సర్దుతుంటూ.

"సరేలేరా! వాడిగోల విడిచిపెట్టి కథను పూర్తిచెయ్."

ఎంతదాకా చెప్పాను-"అయితే తినరన్నమాట" అందికదూ సుభద్ర.

"ఉహూఁ!" అన్నాను.

"ఎలా తినరో నేను చూస్తాను" అని కుడిచేతితో ముక్కల్ని పట్టుకొని, ఎడమచేతితో నా దౌడ నొక్కింది. గబుక్కున నోరు తెరిచాను. ముక్కల్ని నోట్లో పెట్టింది. వేలును గట్టిగా కొరికాను.

"అబ్బా!"అంటూ వేలును లాక్కుంది సుభద్ర.

"సారీ సుభద్రా!" అన్నాను క్షమార్పణగా.

"ఊ! క్షమించాలేం?" అంది వేలూపు ఊపుకుంటూ.

సుభద్రకు మరీదగ్గరగా వచ్చాను. అంత దగ్గరగా రావడం అదే మొదటిసారి. సుభద్ర కుడిచేతిని నా చేతిలోకి తీసుకున్నాను. ఒళ్ళంతా చెమటలు పట్టింది. (అది వేసవికాలం గనుక)- గుండెదడ హెచ్చింది. శరీరంలో విద్యుత్తు ప్రవహించినట్లనిపించింది.

"సుభద్రా!" అంటూ నా కుడిచేతిని ఆమె నడుంమీద వేసి నా మీదకు లాక్కున్నాను. ఏ మధ్యంతరం చెప్పలేను. బలంగా గుండెలకదుముకొని, ఆ లేత పెదవుల్లో దాగిన అమృతాన్ని తనివితీరా గ్రోలి, బుగ్గలమీద రోజామొగ్గల్ని ముద్దు పెట్టుకున్నాను. అంతే...

అదే సమయానికి యింటిముందు రిక్షా ఆగింది. భయంతోను, ఆశ్చర్యంతోను మాటలు పెగలడం లేదు- నాన్నగారు. నాన్నగారి ఆకస్మిక గమనానికి అమితంగా ఆశ్చర్యపోయాను. సుభద్ర నా బిగి కౌగిలి విడిపించుకొని పరుగెత్తుకుంటూ వెళ్ళిపోయింది. నాన్నగారివైపు నేరుగా చూడలేకపోయాను. రిక్షావాడిచేత హోల్డాలు లోపలపెట్టించారు. తుఫానువచ్చేముందు వాతావరణ మెంత ప్రశాంతంగా ఉంటుందో అంత ప్రశాంతంగాను, గంభీరంగాను ఉన్నారు నాన్నగారు.

టేబుల్‌మీద సాసర్‌లోవున్న మామిడిముక్కలు వన్నెక్కిరిస్తూ తమలో తామేవో గుసగుసలాడు కుంటున్నట్టున్నాయ్. నాన్నగారొచ్చిన అయిదవ రోజు రాత్రి అమ్మ వచ్చింది తమ్ముళ్ళతో, చెల్లాయిలతో. నాన్నగారి రాకకెంత ఆశ్చర్య పోయానో, అమ్మ రాకకుకూడా అంతే ఆశ్చర్య పోయాను.

తెల్లవారింది. మామూలుగానే కాలేజీకి వెళ్ళి పోయాను. ఆ రాత్రి భోజనాల దగ్గర - "మన పెద్దబ్బాయి పిచ్చిపిచ్చి వేషాలు వేస్తున్నాడు" అన్నారు నాన్నగారు.

నోట్లో ముద్ద పెట్టుకోబోతూ ఆగిపోయాను నా వైపుచూసి "కాసీవోయ్" అన్నారు.

"మీ అమ్మనింత త్వరగా ఎందుకు రప్పించానో తెలుసా?" అడిగారు నాన్నగారు.

తెలియదని తలూపాను.

వస్తున్న దుఃఖాన్ని బలవంతంగా దిగ్రమింగు కున్నాను. ఆ తరువాత "బివేర్ ఆఫ్ దిస్" అని మాత్రం అన్నారు నాన్నగారు.

ఒకరోజు సాయంత్రం కాలేజీ నుంచి యింటికి వస్తున్నాను.

"ఏమండోయ్! మాట్లాడ్డానికి నోచుకోలేక పోయినా, కనీసం చూపులకైనా నోచుకోలేదా!" ఆ మాటలు పూర్తికాక ముందే. ఆ శబ్దంవైపు తిరిగాను. సుభద్ర! తన తమ్ముడితోబాటు నా వెనుకే వస్తోంది.

"నిజంగా నేను చూడలేదు. సుభద్రా!" అన్నాను. బాధగా నవ్వింది. "మీరు మరీ ఆడపిల్లలా తయారౌవుతున్నారు" అంది.

ముఖం చిట్లిస్తూ- "ఏం ఎందుకని?" అడిగాను.

"మీరు కాలేజీనుంచి యింటికి వచ్చినతరువాత మళ్ళీ తెల్లవారి తొమ్మిదయ్యేదాకా బయటికి ముఖం చూపించరుగా! మరి ఆడపిల్లలలాగే కదూ!" అంది ఓరగా నా ముఖాన్ని చదువుతూ.

"సుభద్రా!" అరిచాను. కోపంగానే అన్నానని నే ననుకున్నాను.

"అబ్బ! ఎంత స్వీట్‌గా మాట్లాడతారండీ!" అన్న సుభద్ర కాంప్లిమెంట్ విని నవ్వకుండా ఉండలేకపోయాను.

"దగ్గర్లోనే చిన్న పార్కు ఉంది. కూర్చుందాం రా!" అని సుభద్ర చేయిపట్టుకు లాక్కెళ్ళాను. సుభద్ర తన తమ్ముడితోబాటు నన్ననుసరించింది. పార్కులో ఓ మూలగా వెళ్ళి-పచ్చికమీద పుస్తకాలు పడేసి కూర్చున్నాను. సుభద్ర నాకు దగ్గరగా కూర్చుంది. వేరుశెనక్కాయలుకొనుక్కొచ్చుకుంటానని బయటికెళ్ళాడు సుభద్ర తమ్ముడు.

ఏకాంతం దొరికేటప్పటికి ఏంమాట్లాడాలో బోధ పడలేదు. ఏదో చెప్పాలనిపిస్తోంది. కాని మాటలు దొరకడంలేదు.

"సుభద్రా!" పిలిచాను.

"ఊఁ" అంది.

గడ్డిని తెంపుతున్న సుభద్ర చేతిమీద నా చేయి వేశాను. నా కళ్ళల్లోకి సూటిగా చూసి గబుక్కున తల దించుకుంది. ఆ చూపులే బ్రహ్మచారుల మనసుల్ని కలవర పెడతయ్.

"ముడుగునపడ్డ కోర్కెలను పురికొల్పుతున్నావ్" అన్నాను అదోలా చూస్తూ.

"అలాగా!" అంది చిలిపిగా.

"కాదేంటిమరి" అని విసురుగా మీదకు లాక్కున్నాను.

"ఉష్! తమ్ముడొస్తున్నాడు" అంది. గాభరాగా వదిలేశాను.

కిల కిలా నవ్వింది. సెలయేటి పరుగులా ఉంది ఆ నవ్వు. వెనక్కి తిరిగిచూస్తే సుభద్ర తమ్ముడు లేడు "అంతా అబద్ధం" అన్నాను చిరుకోపంతో.

"అదిసరేగాని మీరీ ప్రణయ పాఠాలు, కోపాలు కాలేజీలో నేర్చుకుంటున్నారా?" అడిగింది గోముగా.

"కాదు. ఒకమ్మాయి రాత్రి కలల్లోకి వచ్చి, నేర్పి, తుర్రున పారిపోతోంది" అన్నాను.

"ఎవరో ఆ అమ్మాయి?" అంది. తల అవతలికి తిప్పుకుంటూ "చెప్పనా?" అన్నాను ఊరిస్తూ.

"చెప్పండి" అలిగినట్టుంది.

"ఇలా తిరిగితేగాని చెప్పను" అని ఆమె గెడ్డాన్ని పట్టుకొని నా వైపుకు తిప్పుకున్నాను.

"అచ్చు నీలాగే ఉంటుంది" అన్నాను ముఖ కవళికలను గమనిస్తూ.

"ఎక్కడుంది?" ఆ స్వరంలో కాస్త యీర్ష్య కూడా ధ్వనించింది.

"నా ప్రక్కనే ఉంది. కాదు .. కాదు. ఎదురుగా ఉంది." అని నా చేతుల్లోకి— అని చెప్పబోతుండగా.

"కట్! సెన్సార్‌వాణ్ణి యిక్కడ ఉన్నా నన్నైనా గమనించకుండా ఎంత సిగ్గులేని విషయాలు చెబుతున్నావురా?" అని ముక్కుమీద వేలేసుకున్నాడు సుధాకర్.

"క్షమించాలి. పొరపాటు జరిగింది." అని క్షమాపణ చెప్పుకొని ఆ తరవాత తీయని కబుర్లతో ఆ సాయంత్రం అక్కడ గడిపి తీయని ఊహలతో యిల్లు చేరుకున్నాము" అని ముగించాడు నాగేశ్వరరావు.

"ఆ తరువాత ఏమయింది?" అడిగాడు సుదర్శన్.

"ఆఁ! ప్రాక్టీకాక మరేమవుతుంది?" తెలిసినట్టు చెప్పాడు సుధాకర్.

వాడు నవ్వాడు.

నేను మాట్లాడ్లేదు.

మధ్యాహ్నం రెండింటికి మ్యాట్నీకి బయలేరాము. నలుగురమూ కలసి. సినిమా అయిపోగానే ఎవరిదారి వాళ్ళ కయింది. సుధాకర్, సుదర్శన్‌లు ఒకదారిన వెళ్ళారు. నేను, నాగూ కలిసి వస్తున్నాం.

"ఉదయం నీవుచెప్పినకథ నిజంగా జరిగిందేనా ...లేక మామూలుదేనా?" అడిగాను.

"సందేహ మెందుకొచ్చింది?" చిరునవ్వుతో ఎదురుప్రశ్న వేశాడు.

"ఆహాఁ! అలాగనికాదు అంత చనువుగా మెలగి పెళ్ళిచేసుకోక పోవడానికి కారణమేమైనా ఉంటుందా అని అడిగానంతే" అన్నాను.

దానికి వాడు నవ్వుతూ నా భుజంతట్టి - "మా యిద్దరికీ పెళ్ళి నిశ్చయం చేశారు. మా వాళ్ళు" అన్నాడు.

నేను అనుమానంగా వాడివైపుచూసి - "మరి అప్పుడు మీ నాన్నగారు కోప్పడ్డారని చెప్పావే?"

"అవును మొదట మేము కలుసుకోవడానికి ఎన్నో అవరోధాలను కల్పించారు. మేము వాటిని లెక్కచేయలేదు. దాంతో పెద్దవాళ్ళు - వాళ్ళూ వాళ్ళూ మాట్లాడుకొని మా పెళ్ళికి ఒప్పుకున్నారు. అదీ పోయిన నెలలోనే" సమాధాన మిచ్చాడు నాగేశ్వరరావు.

నేను వాడివైపే చూస్తుండిపోయి, తేరుకొని "ప్రేమించి పెళ్ళి చేసుకున్న నీ దాంపత్యజీవితం మూడుపూవులూ- ఆరుకాయలూగా- పిల్లాజెల్లలతో కలకల లాడాలని అభిలషిస్తున్నాను" అని అనక ముందే—

"ఇద్దరు లేక ముగ్గురికంటే ఎక్కువమంది పిల్లలుండకూడదని ఆంక్ష విధించింది ప్రభుత్వం. అందుకని నీ అభిలాషను ఉపసంహరించుకో!" అన్నాడు వాడు నవ్వుతూ.

★

